క్లుప్తంగా

21న జిల్లా విద్యార్థి సమ్మేళనం



ఆహ్వాన పత్రాన్ని డీఆర్వో సత్తిబాబుకు అందజేస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన జిల్లా విద్యార్థి సమ్మేళనాన్ని అమలాపురం ప్రెస్ క్లబ్ భవనంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘటన కార్యదర్శి నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ విద్యార్థి సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని డీఆర్వో సీహెచ్ సత్తిబాబును ఏబీవీపీ ప్రతినిధులు బుధవారం ఆహ్వానించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో జిల్లా విద్యార్థి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు. డీఆర్వో సత్తిబాబును కలిసినవారిలో ఏబీవీపీ ప్రతినిధులు గణేష్, చందు తదితరులున్నారు.

ఓఎన్జీసీ సంస్థ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గోపవరం గ్రామస్తులు

ఉప్పలగుప్తం: గత 30 ఏళ్లుగా ముడి చమురును తరలించుకుపోతున్న ఓఎన్జీసీ సంస్థ తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని గోపవరం గ్రామస్తులు తహసీల్దార్ జె.వెంకటేశ్వరికి బుధవారం వినతి పత్రం అందజేశారు. చమురు తీయడానికి భారీ యంత్రాలను ఉపయోగించే ప్రక్రియలో భాగంగా వాటిని భారీ వాహనాలతో తరలించడంతో రోడ్లు, ఆనుకొని ఉన్న ఇళ్లు బీటలు వారుతున్నాయన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుంచే బాబులు, ఆకుల శ్రీను, పెమ్మిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాల్ బాడ్మింటన్ పోటీలకు యానాం క్రీడాకారులు



జాతీయ బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైన యానాం క్రీడాకారులు

యానాం: తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ఈ నెల 16 నుంచి 20 వరకూ జరిగే 41వ జాతీయ సబ్‌జూనియర్ నేషనల్ బాల్ బాడ్మింటన్ పోటీలకు యానాం బాల్‌బాడ్మింటన్ క్లబ్ క్రీడాకారులు పుదుచ్చేరి జట్టుకు ఎంపికయ్యారని క్లబ్ కార్యదర్శి కాపగంటి ఆదర్శ శేష సుమన్ , కోచ్ బొట్టా శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన 8 మంది క్రీడాకారుల్లో నలుగురు బాలికలు, నలుగురు బాలురు ఉన్నారన్నారు. బాలికల విభాగం నుంచి బళ్లా ప్రవల్లిక, గుఱ్రాల శ్రీవల్లి, ఆలపాటి సంజన, మొండి ఆకాంక్ష, బాలుర విభాగం నుంచి హేమంత్‌కుమార్, కర్నేడి శివసత్యకిషోర్, పాలెపు గంగాధర్‌భరత్, కట్టుంగి దుర్గాసాయివీరేంద్ర పుదుచ్చేరి జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు.

అల్లవరం హైస్కూల్‌కి సీసీ కెమెరాలు బహూకరణ



పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావుకు సీసీ కెమెరాలను అందిస్తున్న ప్రకాశరావు

అల్లవరం: ది పాశర్లపూడి రామగంగా ట్రస్ట్ తరపున అల్లవరం ఉన్నత పాఠశాలకు సీసీ కెమెరాలు బహూకరించారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నైనాల వెంకటేశ్వరరావుకు ట్రస్టు సభ్యులు బొక్కా ప్రకాశరావు చేతుల మీదుగా సీసీ కెమెరాలు అందజేశారు. సీసీ కెమెరాలను అందించిన ట్రస్టు సభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ది పడాలా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కౌమార దశలో ఉన్న విద్యార్థినులకు శారీరక, ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ గెద్దాడ శ్రీనివాసరావు, పడాలా చారిటబుల్ ట్రస్టు వలంటీర్లు మహాలక్ష్మి, రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు కుడుపూడి నాగభాగ్యలక్ష్మి, నాగిరెడ్డి శివప్రసాద్ పాల్గొన్నారు.

సాగునీరు అందించాలి

కాకినాడ సిటీ: పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో కాకినాడ ధర్నా చౌక్ వద్ద తాళ్లరేవు మండలం పి.మల్లవరం, గ్రాంట్‌లకు చెందిన రైతులు ధర్నా నిర్వహించారు. ఏటా వందలాది ఎకరాలు పొట్ట దశలో ఎండిపోతున్నాయన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. సంఘ నాయకులు వల్లు రాజబాబు, జి.శ్రీనివాసరావు, పిల్లి గోవిందు, పంపన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గోరుముద్దలో రాగి జావ



సమనస ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

- మధ్యాహ్న భోజన పథకం మెనూలో చేర్చిన ప్రభుత్వం
- వారానికి మూడు రోజుల పాటు అమలు
- విద్యార్థులకు మరిన్ని పోషకాలు అందేలా చూడడమే లక్ష్యం

అల్లవరం: ప్రతి విద్యార్థికి సంపూర్ణ పోషణ అందించాలన్న దృక్పథంతో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్నం అందిస్తున్న భోజనంలో మరింతగా పోషకాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. జగనన్న గోరుముద్ద పథకంలో ఇప్పుడు అందిస్తున్న మెనూలో మార్చి 2 నుంచి గణనీయమైన మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. గోరుముద్ద పథకంలో ప్రస్తుత మెనూకి అదనంగా 'రాగి జావ'ని చేర్చారు. వారానికి మూడు రోజుల పాటు రాగి జావను అందివ్వనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్యతో పాటుగా సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. గోరుముద్ద పథకంలో ప్రస్తుత మెనూలో ప్రతి రోజు గుడ్డు, చెక్కీతో సహా రోజుకో వెరైటీ కూరతో పోషకాహారాన్ని అందిస్తున్నారు. విద్యార్థుల్లో రక్తహీనత కనిపిస్తున్న నేపథ్యంలో ఈ మెనూకి అదనంగా మార్చి 2వ తేదీ నుంచి రాగి జావను చేర్చారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఉదయాన్నే తయారుచేసిన వేడివేడి రాగిజావని మధ్యాహ్న భోజన నిర్వాహకులు అందించనున్నారు. వారానికి మూడు రోజుల పాటు మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ ఇవ్వనున్నారు. దీని కోసం ప్రతి పాఠశాలకు రాగి పిండి, బెల్లం ప్రభుత్వమే సరఫరా చేయనుంది. దీనివల్ల అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న 35,855 మంది విద్యార్థులకు మేలు జరగనుంది. విద్యార్థులకు రాగి జావను ఇవ్వడం వల్ల వారి ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో పాఠశాలలు, మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	భోజనం చేస్తున్న విద్యార్థులు
అల్లవరం	79	4893	4169
అమలాపురం	106	9023	5519
ఉప్పలగుప్తం	83	5317	4100
ముమ్మిడివరం	75	7921	6983
కాట్రేనికోన	75	6404	4995
ఐ.పోలవరం	79	5596	4201
తాళ్లరేవు	77	8316	5888
మొత్తం	574	47470	35855

ప్రస్తుతం గోరుముద్ద పథకంలో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన మెనూ

సోమవారం	- వెజ్ పలావు, గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం	- పులిహోర, దొండకాయ చెట్నీ, గుడ్డు
బుధవారం	- వెజ్ బిర్యానీ, బంగాళదుంప కూర, గుడ్డు, చిక్కీ
గురువారం	- లెమన్ రైస్, టమాటా చెట్నీ, గుడ్డు
శుక్రవారం	- పప్పు ఆకుకూర, అన్నం, గుడ్డు, చిక్కీ
శనివారం	- ఆకుకూరతో చేసిన అన్నం, స్వీట్ పొంగల్

రాగి జావ అందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం



మధ్యాహ్న భోజన పథకంలో రాగి జావ అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. దీనికోసం సన్నాహాలు చేస్తున్నాం ప్రతి పాఠశాలకు రాగిపిండి, బెల్లం ప్రభుత్వమే సరఫరా చేయనుంది. మధ్యాహ్న భోజన నిర్వాహకులు రాగిజావని తయారుచేసి విద్యార్థులకు అందిస్తారు.

– గుబ్బల సూర్యప్రకాష్, ఎంఈఓ, అమలాపురం

రాగిజావలో పుష్కలంగా పోషకాలు



రాగి పిండిలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకల ధృడత్వానికి ఎంతో ఉపయోగపడుతుంది. వేరుశెనగ, నువ్వులు, ఆకుకూరలు, గుడ్డుతో పాటుగా రాగి పిండిలో ఐరెన్ కంటెంట్ ఉంటుంది. ఇవి విద్యార్థుల్లో రక్తహీనతను నివారించి శక్తిని, బలాన్ని అందిస్తాయి. పిల్లల్లో ఎదుగుదల బాగుంటుంది.

– డాక్టర్ వై.సుధీర్‌కుమార్, సీహెచ్‌సీ, అల్లవరం

సాగునీటి సమస్య లేకుండా చర్యలు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



గ్రాంటు గ్రామంలో నీరులేక ఎండిపోతున్న వరిచేలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: మండల పరిధిలోని శివారు ప్రాంతాల్లో సాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఇరిగేషన్ ఉన్నతాధికారులతో కలిసి పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని శివారు ప్రాంతాలైన పత్తిగొంది, గ్రాంటు, మూలపొలం గ్రామాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో నీరు లేక ఎండిపోతున్న వరి చేలను ఎమ్మెల్యే పొన్నాడ పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు ఆయనకి మొర పెట్టుకున్నారు. నీరు లేక ఒక్క ఎకరా కూడా ఎండిపోయే పరిస్థితి రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పొన్నాడ అధికారుల్ని ఆదేశించారు. అవసరమైతే ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని ఆయన చెప్పారు. సాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామని రైతులకు భరోసా కల్పించారు. క్షేత్రస్థాయి పర్యటనలో ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణ, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాస్, ఈఈ పి.విజయ్‌కుమార్, డీఈ వీవీ రామకృష్ణ తదితరులున్నారు.

తాతపూడి పంపింగ్ స్కీంతో సాగునీటి సమస్య దూరం

తాళ్లరేవు: తాతపూడి పంపింగ్ స్కీంను వినియోగంలోకి తేవడం ద్వారా సాగునీటి సమస్య నుంచి బయటపడొచ్చని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో సాగునీటి సరఫరా తగ్గినపుడు తూర్పు డివిజన్‌కు తాతపూడి ఎత్తిపోతల పథకం ఎంతగానో ఉపయోగపడేదన్నారు. ప్రస్తుతం నీటి ఎద్దడి ఉన్న పరిస్థితులలో ఈ పథకానికి ప్రభుత్వం సుమారు రూ.8 లక్షలు మంజూరు చేయడం చాలా సంతోషదాయకమన్నారు. తాతపూడి ఎత్తిపోతల పథకానికి అధికారులు త్వరితగతిన మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని కోరారు. దీనిద్వారా తూర్పు డెల్టాలోని శివారు ప్రాంతంలోని వరిచేలు దెబ్బతినకుండా నీటి సరఫరా జరగడానికి అవకాశం ఉందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన అరదాడి కల్యాణ్

తాళ్లరేవు: ఈ నెల 17 నుంచి 19 వరకూ విశాఖపట్టణం బీహెచ్‌పీవీ గ్రౌండ్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు పటవల హైస్కూల్ విద్యార్థి అరదాడి కల్యాణ్ ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్–14 విభాగంలో కల్యాణ్ ఎంపికైనట్లు హైస్కూల్ పీడీ వి.మాచరరావు బుధవారం తెలిపారు. విద్యార్థి కల్యాణ్‌తో పాటు పీడీ మాచరరావును హెచ్‌ఎం సీహెచ్ కాశీవిశ్వనాథం, ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, పటవల సర్పంచ్ పినపోతు చిన కామేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ నరాల శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

ప్రజా వినతుల స్వీకరణ

యానాం: ప్రజా సమస్యలపై వచ్చే వినతులను ప్రతి నెలా 15వ తేదీన అన్ని ప్రభుత్వ శాఖలు స్వీకరించాలని ఎల్జీ తమిళిసై సౌందరాజన్ ఆదేశాల మేరకు బుధవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ, ఆర్‌ఏఓ కార్యాలయం, విద్యుత్, సివిల్ సప్లయిస్ తదితర శాఖల్లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి అధికంగా వినతులొచ్చాయని అధికారులు చెబుతున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం క్రాపచింతలపూడిపాలెంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. కొబ్బరి తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4,700 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం



ధనలక్ష్మి, కల్యాణలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే అశోక్



అమ్మవారి గ్రామోత్సవంలో వేషధారణలు

విశేష పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాంలో కొలువైన ధనలక్ష్మి, కల్యాణలక్ష్మి అమ్మవారి విగ్రహప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా రెండో రోజు బుధవారం అమ్మవారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు మేళతాళాలు, సాంస్కృతిక నృత్యాల నడుమ యానాం పురవీధుల్లో సాగింది. అమ్మవారికి జలాధివాసం, హోమాలు, చతుర్దశ అగ్నిమథనం, కుంభపూజ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో చింతా బుల్లెయ్య, వెంకటగణేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణతో పొదుపు అలవరచుకోవాలి

డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్



ఆర్థిక క్రమశిక్షణ-పొదుపు బుక్‌లెట్‌లను విడుదల చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శివ శంకర ప్రసాద్

అమలాపురం టౌన్: పెరిగిపోతున్న ఖర్చుల నియంత్రణకు ఆర్థిక క్రమశిక్షణతో పొదుపును అలవరచుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివశంకర ప్రసాద్ సూచించారు. భారతీయ రిజర్వు బ్యాంక్‌చే నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత–2023 సంవత్సరం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో గత మూడు రోజులుగా 'ఆర్థికపరమైన ప్రవర్తన–పొదుపు సంరక్షణ' అనే అంశంపై నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అవగాహన సదస్సుకు శివ శంకర్‌ప్రసాద్ బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి నాగప్రవీణ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆర్థిక అక్షరాస్యత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బ్యాంక్‌లు, ఖాతాదారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ఎదురవుతున్న సైబర్ నేరాలు, అవసరం లేని యాప్‌లపై ఎంతటి అప్రమత్తంగా ఉండాలో ఉదాహరణలతో చెప్పారు. జిల్లా లీడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఇతర బ్యాంక్‌లు సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహించాయి. సదస్సుకు అధ్యక్షత వహించిన జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్(ఎల్‌డీఎం) లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పొదుపు గురించి అవగాహన కల్పిస్తూనే సైబర్ నేరాల నుంచి ఎలా బయటపడాలో వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఎన్ కళాశాల సంయుక్త కార్యదర్శి యేడిది నళినీ కుమార్, ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ హాజరయ్యారు.

పూర్తి కాల లెఫ్టినెంట్ గవర్నర్‌ను నియమించాలి

యానాం: పుదుచ్చేరికి పూర్తి స్థాయి లెఫ్టినెంట్ గవర్నర్‌ను నియమించాలని మాజీ ఎంపీ ఎం.రామదాస్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కేంద్రం 13 రాష్ట్రాలకు గవర్నర్‌లను నియమించిందని, పుదుచ్చేరికి మాత్రం పూర్తికాలం పనిచేసే ఎల్జీని ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం తమిళిసై సౌందరాజన్ తెలంగాణ గవర్నర్‌గా ఉన్నారని, ఆమెకు పుదుచ్చేరికి అదనపు బాధ్యతలు ఇచ్చారన్నారు. రెండుచోట్ల ఆమె విధులు నిర్వహించడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు.

వెంకన్న కల్యాణోత్సవాల నిర్వహణపై సమీక్ష



కల్యాణోత్సవ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి, ఈవో సాయిబాబు

అమలాపురం టౌన్: మార్చి 31వ తేదీ నుంచి జరగనున్న అమలాపురం వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల నిర్వహణపై ఆలయ చైర్ పర్సన్ దూడల వెంకట విరీతాదేవి అధ్యక్షతన ఆలయంలో బుధవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. కల్యాణోత్సవాలు, రథోత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఆలయ ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు, అర్చకులు, ఆలయ సిబ్బందితో జరిగిన ఈ సమావేశంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలనే అంశంపై చర్చించారు. మార్చి 31న అంకురార్పణంతో మొదలయ్యే కల్యాణోత్సవాల్లో రోజువారీ కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. కల్యాణం సమయానికి ఆలయంలో భక్తుల సహకారంతో నిర్మిస్తున్న శాలాహారం, స్వామి వారి కల్యాణం నిర్వహించే మండపం పనులు పూర్తి చేస్తామని చైర్‌పర్సన్ విరీతాదేవి చెప్పారు. ఇప్పటినుంచే ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని ఆమె సిబ్బందికి సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ పరిహార నిబంధనల్లో మార్పు

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ వెల్లడి



వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: వేట నష్టపోతున్న యానాం మత్స్యకారులకు ఇచ్చే ఓఎన్‌జీసీ ఇచ్చే పరిహారానికి సంబంధించి నిబంధనల్లో మార్పులు చేస్తూ పుదుచ్చేరి కార్యదర్శి ఎస్.మురుగేషన్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓఎన్‌జీసీ సంస్థ కేజీ బేసిన్ డీప్‌వాటర్ ఎన్‌ఈఎల్‌పీ బ్లాక్ నుంచి పి.మల్లవరంలోని ఆఫ్‌షోర్ టెర్మినల్ వరకు రెండో గ్యాస్ ఎక్స్‌పోర్ట్ పైప్‌లైన్ వేస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు వేట నష్టపోతున్నారని అన్నారు. పరిహారం పొందేందుకు లబ్ధిదారులు 18–65 ఏళ్ల మధ్య వయసు కలిగి ఆధార్‌కార్డులో పుట్టిన తేదీ కాకుండా కేవలం వయసు ధ్రువీకరణ కలిగి ఉంటే సరిపోతుందన్నారు. ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీలో సభ్యత్వం లేకపోయినప్పటికీ అర్హులేనని, రిజిస్టర్, నాన్ రిజిస్టర్ నావ యజమానితోపాటు వాటిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నవారు, ఒంటరి మహిళగా ఉన్నవారు, మైనర్ పిల్లలు ఉన్నవారు, వివాహిత పిల్లలకు పరిహారం అందిస్తారన్నారు. విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల బృందం ధ్రువీకరణ చేయాలని, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లు తీసుకునేవారు సైతం పరిహారానికి అర్హులన్నారు. ఏపీలోని నిబంధనలను పరిహారానికి ప్రామాణికంగా మార్చారని తెలిపారు.

గ్రామ బహిష్కరణపై విచారణ



చల్లపల్లిలో విచారణ చేపడుతున్న అధికారులు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి చింతల చెరువుకు చెందిన బి.వెంకటేశ్వరరరావు తనను గ్రామ బహిష్కరణ చేశారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దార్ వెంకటేశ్వరి, ఎస్ఐ వెంకటేశ్వరరావుల సమక్షంలో బుధవారం విచారణ జరిపారు. ఈ విచారణపై తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి బహిష్కరణలు జరగలేదన్నారు. మద్యం మత్తులో ఉండటంతో గ్రామ పెద్దలకు తనకు చిన్నపాటి వాగ్వాదం జరిగిందని ఫిర్యాదుదారుడు వెంకటేశ్వరరరావు అంగీకరించారన్నారు. ఈ విషయంపై ఇరువర్గాలతో మాట్లాడి రాజీ చేశామని, గ్రామంలో ఏ ఘటన జరిగినా సొంత నిర్ణయాలు తీసుకోకుండా అధికారులకు తెలియజేయాలని తహసీల్దార్ సూచించారు.

మంత్రి వేణును కలిసిన కుడుపూడి



మంత్రి వేణును మర్యాద పూర్వకంగా కలిసిన సూర్యనారాయణ

రామచంద్రపురం: రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని మంత్రి వేణు క్యాంపు కార్యాలయానికి సూర్యనారాయణ విచ్చేసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇద్దరూ ప్రభుత్వం బీసీలకు అమలు చేస్తున్న పథకాలపై చర్చించారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, నాయకులు వాసంశెట్టి తాతాజీ, గుత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవత జాతర

అల్లవరం: మండలంలోని సన్నవిల్లి గ్రామంలో కొలువైన వైష్ణవి కనకదుర్గ అమ్మవారి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని పూలతో ఆకర్షణీయంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పలు వేషాధారణలతో, గరగ నృత్యాలతో, డప్పు వాయిద్యాలతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది



సమావేశంలో మాట్లాడుతున్న సినీ నటి కరాటే కల్యాణి

అమలాపురం రూరల్: బీజేపీకి తెలంగాణలో బలమైన ఓటు బ్యాంకు ఉందని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ మహిళా నాయకురాలు, సినీ నటి కరాటే కల్యాణి అన్నారు. అమలాపురం వచ్చిన ఆమె బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు నివాసంలో బుధవారం పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రాలో బీజేపీ బలపడుతుందని చెప్పారు. అనంతరం కరాటే కల్యాణిని మోకా వెంకట సుబ్బారావు సత్కరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు అరిగెల వెంకట రామారావు, ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి దూరి రాజేష్, కొండేటి ఈశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.